సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023



హామీలు నెరవేర్చడంలో విఫలం

ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. 8లో▸



పాఠశాలల బలోపేతానికి చర్యలు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విద్యా సంక్షేమ నిర్మాణాత్మక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి అన్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
36.0/17.0

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.
ఉక్కపోత పెరుగుతుంది.
గాలిలో తేమశాతం తక్కువ నమోదవుతుంది.

న్యూస్‌రీల్

విద్యా ప్రమాణాలు పెంచాలి



మాట్లాడుతున్న డీఈవో మాధవి

ఎలిగేడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచాలని, ఇందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని డీఈఓ మాధవి అన్నారు. మండలకేంద్రంతోపాటు సుల్తాన్‌పూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో జరిగిన పోషకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులు తరచూ ఉపాధ్యాయులతో మాట్లాడాలని, పిల్లల సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందుతోందని, రానున్న విద్యాసంవత్సరంలో ఎక్కువమంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. సుల్తాన్‌పూర్ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ పాఠశాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తానని, తమ పాఠశాల స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు నలుమాసు సుదర్శనం, గుజ్జుల జీవన్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు సంతోష్‌రెడ్డి, విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామయ్యకు గోటితో ఒలిచిన తలంబ్రాలు



ధాన్యాన్ని ఒలుస్తున్న మహిళలు

యైటింక్లయిన్‌కాలనీ: భద్రాద్రి రామయ్య పెళ్లి సంబంధించి తలంబ్రాల కోసం మహిళలు ధాన్యాన్ని గోటితో ఒలిచారు. రామగుండం కార్పొరేషన్ ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆర్తి స్వచ్ఛద సేవా సంస్థ ఆధ్వర్యంలో గోటితో ఒలిచారు. భద్రాచలం రామయ్య కల్యాణానికి రామదాసు వంశస్థుడు రామదాసు తిరుపతి పంపించిన ధాన్యాన్ని ఒలిచి బియ్యాన్ని తిరిగి పంపించారు. స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు విజయ, ఉమ, విజయ, లలిత, స్వప్న, కళ తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు ఎత్తివేయాలి



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దపల్లిరూరల్: వ్యవసాయానికి 24గంటల విద్యుత్ ఇస్తున్నామని బీఆర్ఎస్ గొప్పలకు పోవడం తప్ప నిత్యం కోతలు విధిస్తోందని బీజేపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు కొంతం శ్రీనివాసరెడ్డి, ఠాకూర్ రాంసింగ్ అన్నారు. అప్రకటిత కోతలు ఎత్తివేసి నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నల్లబ్యాడ్జీలతో ట్రాన్స్‌కో ఎస్ఈ ఆఫీసు ముందు నిరసన వ్యక్తం చేశారు. కరెంటు ఎపుడొస్తుందో..? ఎప్పుడు పోతుందో విద్యుత్ అధికారులకే తెలియడం లేదంటే పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. నాయకులు పర్శ సమ్మయ్య, ఆనంద్, శ్రీనివాస్, ఫహీం, తూడి రవీందర్, జ్యోతిబసు తదితరులున్నారు.

బీ-థర్మల్‌పై మంత్రితో ఎమ్మెల్యే సమీక్ష



విద్యుత్ మంత్రితో రామగుండం ఎమ్మెల్యే చందర్

రామగుండం: 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ థర్మల్ విద్యుత్ కేంద్రం సమస్యపై రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హైదరాబాద్‌లో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డితో శనివారం సమావేశమయ్యారు. కేంద్రానికి జనవరి 26 నుంచి బొగ్గు, ఆయిల్ సరఫరా లేక విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోతుందన్నారు. సాంకేతిక సమస్యలు, నిధులపై ఎమ్మెల్యే మంత్రికి నివేదిక అందించారు. మంత్రి సీఎండీ ప్రభాకర్‌రావుతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయిల్, బొగ్గు సరఫరాకు ఆదేశించారు.

కుక్కలు.. కోతుల బెడద నియంత్రిస్తాం..

సాక్షి ఫోన్ ఇన్

- పందులు, దోమల నివారణకు చర్యలు
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- రూ.3కోట్ల వ్యయ అంచనాలతో పనులు
- తాగునీటి సరఫరా మెరుగుపరుస్తాం

'సాక్షి ఫోన్‌ఇన్'లో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి



పెద్దపల్లిరూరల్: 'పెద్దపల్లి పట్టణంలో ప్రజలకు కనీస వసతులు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాం. స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి సూచనలతో పాలకమండలి సభ్యుల ఆమోదంతో ప్రజలకు తాగునీటి వసతిని మెరుగుపర్చడం, డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణానికి పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నాం..' అని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. 'సాక్షి' నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో ప్రజల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. పట్టణంలోని జెండాకూడలి వద్ద మొబైల్ టాయిలెట్ కావాలని, దోమలు, పందులు, కోతులు, కుక్కల బెడద ఉందని నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాశ్రేయస్సుకనుగుణంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

ప్రశ్న: పట్టణంలో చెత్తసేకరణ సమస్యగా మారింది. సిబ్బంది సంఖ్యను ఎందుకు పెంచడం లేదు..?
– బి.సురేశ్‌గౌడ్, శ్రీమాన్ కాంగ్రెస్‌నాయకులు

కమిషనర్: పారిశుధ్యం మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. వార్డుకు కనీసం ఇద్దరు సిబ్బంది ఉండేలా కౌన్సిల్ ఆమోదంతో చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: రోజువారీగా గల్లీలో చెత్త సేకరించడం లేదు..?
– నూగూరి మహేందర్, రిటైర్డ్ ఉద్యోగి

కమిషనర్: గల్లీల్లో గతంలో రిక్షాల ద్వారా చెత్తసేకరణ జరిగేది. ఇపుడు ఆటో ట్రాలీల ద్వారా సేకరిస్తున్నాం. వీలైనంత వరకు రోజువారీగానే సేకరిస్తున్నాం.

ప్రశ్న: కలెక్టరేట్‌కు సమీపంలో రైస్‌మిల్లుల నుంచి వచ్చే వ్యర్థాలతో దుర్వాసన వస్తోంది..
– సంతోష్, రంగంపల్లి

కమిషనర్: రాజీవ్‌రోడ్డు వెంట ఉన్న రైస్‌మిల్లుల యజమానులకు సూచించి నీరు బయటకు రాకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: విద్యుత్ సమస్యలు ఉన్నాయి. అవసరమైన ప్రాంతాల్లో స్తంభాలు ఎప్పుడేస్తారు..?
– మంథన కృష్ణ, నవీన్, అంజయ్య, రాజు

కమిషనర్: పట్టణప్రగతిలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు.. తదితర అవసరాలను గుర్తించాం. ఆయా పనులకు టెండర్లు పూర్తయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

ప్రశ్న: మున్సిపల్ ఆఫీసు భవనాన్ని మరో చోటుకు మార్చాలి. పనులనిమిత్తం దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు రాలేకపోతున్నారు.. – వినయ్‌కుమార్‌జైన్, అమర్‌నగర్

కమిషనర్: కార్యాలయానికి సొంతభవన పనులు త్వరలోనే మొదలవుతాయి. ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేనందునే మూడంతస్తుల భవనాన్ని అద్దెకు తీసుకున్నాం. ప్రజలు సహకరించాలి.

ప్రశ్న: సెట్‌బ్యాక్ లేకుండా భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు..?
– శ్రీనివాస్ 26వార్డు, ఇబ్రహీం, 5వవార్డు

కమిషనర్: రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా.. నిబంధనలు పాటించకపోయినా ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పందులు, కుక్కల బెడద ఎక్కువగా ఉంది..? – తూముల సుభాష్‌రావు, కోల అనిత, సురేశ్, అదప సంతోష్, వర్మ, రవికుమార్, పదాల సతీష్, సునిల్‌గౌడ్

కమిషనర్: కుక్కలను కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టాం. పందులను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోగా.. పెంపకందారులు కోర్టుకెళ్లారు. వారితో చర్చించి పరిష్కారం చూపుతాం.

ప్రశ్న: డ్రైనేజీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.. అవసరమైన ప్రాంతాల్లో నిర్మించాలి..
– శీలంబాబు, రాజేంద్రప్రసాద్, జగదీశ్

కమిషనర్: డ్రైనేజీల నిర్మాణాలకు అవసరమైన పనులకు టెండర్లు పూర్తయ్యాయి. సుభాష్‌నగర్‌లో పనులు త్వరలోనే మొదలవుతాయి. సాగర్‌రోడ్డు పనులు పురోగతిలో ఉన్నాయి.

ప్రశ్న: ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై నియంత్రణలేదు.. రాజీవ్ రోడ్డుపై ఆక్రమణలతో ఇబ్బందులున్నాయి..
– మహమ్మద్ ఖాసీం, (సోడాబాబు)

కమిషనర్: ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్ల నిర్వాహకులు ప్రజలకు పొగ, తదితర సమస్యలు లేకుండా చూసేలా ఆదేశిస్తాం. రోడ్లపై ఆక్రమణలను సిబ్బందితో తొలగిస్తాం.

ప్రశ్న: దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయించండి.. – పదాల సతీష్‌గౌడ్, రాజేశ్

కమిషనర్: పట్టణంలో నాలుగు ఫాగింగ్ మిషన్లతో దోమల నిర్మూలనకు స్ప్రే చేయిస్తున్నాం. ప్రతి వార్డులో ఫాగింగ్ జరుపుతున్నాం. దోమల నిర్మూలనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

ప్రశ్న: మూత్రశాలలు లేక బహిరంగ ప్రదేశాల్లో విసర్జిస్తున్నారు.. – ఆర్‌వి.రమణారావు, అరబిందో స్కూల్ కరస్పాండెంట్

కమిషనర్: పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సులభ్ కాంప్లెక్సులు నిర్మించాం. ఇంకా అవసరముంటే మూత్రశాలలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: తాగునీరు రావడం లేదు.. మిషన్ భగీరథ నీళ్లు ఎప్పుడందిస్తారు..?
– సలీం, బృందావన్‌కాలనీ, రంగంపల్లి

కమిషనర్: మిషన్ భగీరథ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పెద్దపల్లిలో మాస్టర్ ప్లాన్ అమలుచేస్తున్నారా..?
– పెర్క సంతోష్, కాంగ్రెస్ నాయకుడు

కమిషనర్: ఇప్పటికైతే అలాంటి ఆలోచన లేదు. ప్రజాభిప్రాయసేకరణ మేరకే మాస్టర్ ప్లాన్ అమలవుతుంది.

ప్రశ్న: జెండా కూడలిలో మొబైల్ టాయిలెట్ ఏర్పాటు చేయండి..
– మంథని నర్సింగ్, మెయిన్ రోడ్

కమిషనర్: మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.



మిగిలింది మూడు రోజులే..!

- ఇవ్వాల్సిన సీఎమ్మార్ 55వేల టన్నులు
- ఈనెలలోపే లక్ష్యాన్ని చేరాలన్న అధికారులు
- గడువు లోపు పంపిణీ సాధ్యమేనా అని అనుమానాలు
- జిల్లావ్యాప్తంగా వెనుకబడిన 60 మిల్లులు

సుల్తానాబాద్: జిల్లాలో సీఎమ్మార్ సేకరణ ఆలస్యమవుతోంది. కేంద్రం రెండు, మూడుమార్లు గడువు పొడిగించినప్పటికీ మిల్లింగ్‌లో వేగం కనిపించడం లేదు. 2021–22 నుంచి 2022–23 వానకాలం మూడు సీజన్లలో ఒక్కటీ లక్ష్యాన్ని చేరలేదు. గత సీజన్‌కు సంబంధించి ఇంకా 55,343 టన్నుల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. అధికారులు రోజువారీ లక్ష్యాలు నిర్దేశించినప్పటికీ మిల్లింగ్ మాత్రం నత్తను తలపిస్తోంది. జిల్లావ్యాప్తంగా గత యాసంగి సీజన్‌లో 2.64లక్షల టన్నుల ధాన్యం సేకరించారు. వీటిని జిల్లాలోని 198 మిల్లులకు కేటాయించారు. ఈమేరకు 1.98లక్షల టన్నుల బియ్యం ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించారు. రైస్‌మిల్ యజమాన్యాలు కస్టమ్‌మిల్లింగ్‌ను ఈనెల 28 వరకు ప్రభుత్వానికి అప్పగించాలని జాయింట్ కలెక్టర్ లక్ష్మీనారాయణ, డీఎస్‌ఓ వెంకటేశ్ ఆదేశించారు. మిగిలింది మూడు రోజులే కావడంతో 60 రైస్‌మిలర్లు 55వేల టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగిస్తాయా..? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అధికారులు ప్రజాప్రతినిధులతో చర్చలు జరిపి గడువు పొడిగిస్తారని రైస్‌మిల్లర్లలో కనిపిస్తోంది.

జిల్లాలో 198 రైస్ మిల్లులు

జిల్లా వ్యాప్తంగా 198 రైస్ మిల్లులు ఉన్నాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని ఈ మిల్లులకు చేరవేసింది. వాటిని కస్టమ్ మిల్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. 138 రైస్ మిల్లులు కేటాయించిన బియ్యం అందించినా మరో 60మిల్లులు లక్ష్యాన్ని చేరలేదు. 2022–23 వానకాలం లెవీ కోటా పూర్తి చేయించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటికే పలుమార్లు గడువు పొడిగించగా.. తాజాగా లక్ష్యం పూర్తి చేయించేందుకు ఈ నెల 28 వరకు తుది గడువుగా పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో అధికారులు మిల్లర్లతో సమీక్షలు నిర్వహిస్తున్నారు.

నిబంధనల ప్రకారం నడుచుకోవాలి



రైస్ మిల్లర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాలి. ఈనెల 28లోగా బాకీపడినా, రైస్ మిల్లు వెంటనే అప్పగించాలి. 60 మిల్లుల యజమాన్యం వెంటనే అప్పగించాలి. మరో రెండు నెలల్లో ఈ ఏడాది యాసంగి సీజన్ ధాన్యం రాబోతుంది. అప్పటి వరకు పూర్తయితేనే వాటిని నిలువ చేయడానికి స్థలం ఉంటుంది.

– వెంకటేశ్, డీఎస్‌ఓ

ప్రత్యేక దృష్టిపెడితేనే..

సీఎమ్మార్‌పై కలెక్టర్ సంగీత, జేసీ లక్ష్మీనారాయణ ప్రత్యేక దృష్టిపెట్టారు. తహసీల్దారు, ఉప తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించారు. ప్రతి మిల్లు రోజువారీ లక్ష్యం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వయంగా మిల్లులు తిరిగి వివరాలు తెలుసుకున్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్షించారు. గతంలో మాదిరిగా చర్యలు తీసుకుంటేనే సీఎంఆర్ పూర్తయ్యేలా కనిపిస్తోంది. మరో రెండు నెలల్లో ఈ ఏడాది యాసంగి సీజన్ ధాన్యం రాబోతోంది. అప్పటి వరకు పూర్తయితేనే వాటిని నిలువ చేయడానికి స్థలం ఉంటుంది.

చిన్న మిల్లర్లకే కష్టాలు

సాధారణంగా ఒక సీజన్‌కు సంబంధించిన కోటాను తర్వాతి సీజన్ ధాన్యం చేతికందే నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఏడాది పాటు గడువు ఇస్తుంది. ఫలితంగా చిన్న మిల్లులు, సార్టెక్స్ యంత్రాలు లేని మిల్లర్లు పౌరసరఫరాల శాఖపైనే ఆశలు పెట్టుకున్నాయి. మిల్లర్ల సంఘాలన్నింటినీ రద్దు చేసి, అడ్‌హాక్ కమిటీని నియమించుకున్నారు.

పట్టుదలతో చదివి.. కలలు సాకారం చేసుకోండి



మాట్లాడుతున్న మధు

మంథని: ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. శనివారం మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడావార్షికోత్సవంలో మాట్లాడారు. పిల్లలపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, వారి కలలను సాకారం చేయాలని సూచించారు. కళాశాలలో సదుపాయాలు కల్పించి బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. సింగరేణి, సీఎస్సార్, ఎన్టీపీసీ, మున్సిపాలిటీ, మండల, జిల్లా పరిషత్ ఇలా అవసమున్న చోట నిధులు సేకరించి వసతులు కల్పిస్తామని తెలిపారు. పేద విద్యార్థుల చదువుకు తమవంతు సాయం అందిస్తామన్నారు. ఆర్థిక స్థోమత లేనివారికి రెండు సెమిస్టర్ల ఫీజు చెల్లిస్తానని హామీ ఇచ్చారు. ఓట్ల కోసం పనిచేసే నాయకులు మళ్లీ వస్తారని, అలాంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, సర్పంచ్ ఎరుకల తిరుపతమ్మ, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, కళాశాల ప్రిన్సిపల్ తాహెర్‌హుస్సేన్, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్లు మాదాడి ప్రభాకర్‌రెడ్డి, కొండేల మారుతి ఉన్నారు.

పేదలకు న్యాయ సహాయం అందించాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అర్జున్

ధర్మారం: యువత లీగల్ పారా ఏయిడ్ వాలంటీర్లుగా రిజిస్టర్ చేయించుకుని.. గ్రామంలోని నిరుపద కుటుంబాలకు న్యాయ సహాయం అందించేందుకు కృషిచేయాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎం.అర్జున్ సూచించారు. మండలంలోని దొంగతుర్తిలో శనివారం జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి సర్పంచ్ ముత్యాల చంద్రశేఖర్ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నామని, బాల్య వివాహాలు, వరకట్నం, మహిళలపై వేధింపులు, అత్యాచారాలు, అపహరణ వంటి సంఘటనలు జరిగినప్పుడు బాధితులతో సమాజం ఎలా స్పందించాలనే విషయాలపై అవగాహన కలిపించారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దాడి సదయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్‌బాబు, చీఫ్ డిఫెన్స్ లీగల్ ఏయిడ్ కౌన్సిల్ మచ్చు శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ శంకర్, అసిస్టెంట్ డిఫెన్స్ లీగల్ ఏయిడ్ కౌన్సిల్ సంకీర్తన, న్యాయవాది నరేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీదర్ దొంగల పనే!

- కొండగట్టు ఆలయ చోరీ కేసులో పురోగతి
- 24 గంటల్లోనే నిందితులను గుర్తించిన పోలీసులు
- సెల్‌టవర్ డంప్ ఆధారంగా ముగ్గురి నంబర్లు గుర్తింపు
- చోరీ అనంతరం కర్ణాటక పారిపోయిన దొంగలు
- పట్టుకువచ్చేందుకు కర్ణాటక వెళ్లిన ప్రత్యేక బృందం
- పొరుగురాష్ట్రం దొంగలని ముందే వెల్లడించిన 'సాక్షి'



సీసీ ఫుటేజీల్లో రికార్డయిన దొంగల కదలికలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జగిత్యాల జిల్లా కొండగట్టు చోరీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఆలయంలో వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన దొంగలను కర్ణాటకలోని బీదర్ జిల్లాకు చెందినవారిగా చోరీ జరిగిన ప్రాంతంలో లభించిన సీసీ ఫుటేజీ, సెల్‌టవర్ నుంచి సేకరించిన వివరాల ఆధారంగా గుర్తించారు. ఇటీవలే ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్వయంగా పర్యటించి ఆలయాభివృద్ధికి రూ.600 కోట్లు ప్రకటించిన నేపథ్యంలో చోరీ జరగడం సంచలనం రేపింది. రాష్ట్రమంతా కొండగట్టు పుణ్యక్షేత్రంపై చర్చిస్తున్న నేపథ్యంలో ప్రధానాలయంలో చోరీ జరగడంతో పోలీసులు ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని 24 గంటల్లోనే నిందితులను గుర్తించారు.

మధ్యాహ్నానికి కొలిక్కి వచ్చిన కేసు

సీఎం పర్యటించిన వారంరోజుల్లోనే ఆలయంలో చోరీ జరగడంపై పోలీసు ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించి మధ్యాహ్నానికి కేసులో కీలక పురోగతి సాధించారు. ఆలయంలో దొంగతనం చేసింది కర్ణాటకకు చెందిన ముఠాగా గుర్తించారు. దొంగలు 24వతేదీ శుక్రవారం తెల్లవారుజామున 1.20 గంటల తరువాత భేతాళ గుడి పక్క నుంచి ప్రధానాలయం వెనక తలుపులు బద్దలుకొట్టి లోనికి ప్రవేశించారు. లోనికి వచ్చే సమయంలో జనాల దృష్టి మరల్చేందుకు సెక్యూరిటీ దుస్తులు, చేతిలో లాఠీ, ఒంటిపై కొత్త పసుపు శాలువా కప్పుకుని వచ్చారు. శాలువాలో చోరీ చేసేందుకు వీలైన పనిముట్లు తీసుకొచ్చారు. ఉదయం 1.20నిమిషాల నుంచి ఉదయం 4 గంటల మధ్యలో దొంగతనం జరిగింది. ఈ మధ్యకాలంలో కొండగట్టుపై యాక్టివ్‌గా ఫోన్ నంబర్ల డేటాను పోలీసులు సేకరించారు.

కర్ణాటకకు బయల్దేరిన పోలీసులు

అందులో కొన్ని నంబర్లు కర్ణాటకకు చెందినవి. అనుమానాస్పదంగా కనిపించిన ఈ నంబర్లకు సంబంధించిన మరిన్ని వివరాలు సేకరించేందుకు కొండగట్టుపై సెల్‌ఫోన్ సేవలు అందించే సెల్‌టవర్ల నుంచి డంప్ (కాల్స్ వివరాలు) మొత్తం జల్లెడ పట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన నంబర్లు కర్ణాటకకు చెంది ఉండటం, చోరీకి ముందు తరువాత అక్కడ నుంచి మాయమవడంతో పోలీసులు వీటిపై ప్రత్యేక దృష్టిసారించారు. అనుమానాస్పద నంబర్ల చిరునామాలు, వీటి సీడీఆర్ (కాల్ డేటా రికార్డు)ను కూడా సంగ్రహించారు. ఆ నంబర్ల కాల్స్ కర్ణాటకకు చెందిన నంబర్లతో కనెక్ట్ అయి ఉన్నట్లు హిస్టరీ తేలడంతో మరింత లోతుగా అన్వేషించారు. దీంతో అవే నెంబర్లు మెట్‌పల్లి, కామారెడ్డిల మీదుగా బీదర్ వరకు ఆయా సెల్‌టవర్ల లోకేషన్లతో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలంలో లభించిన వేలిముద్రలు కూడా కీలక ఆధారాలుగా మారాయని తెలిసింది. దీంతో నిందితులు బీదర్ జిల్లాకు చెందిన దొంగలుగా నిర్ధరణకు వచ్చారు. వెంటనే బీదర్ పోలీసులకు సమాచారం ఇచ్చి రెండు ప్రత్యేక బృందాలు కర్ణాటకకు బయల్దేరాయి.

దొంగలను పట్టుకున్న పోలీసులు..?

ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ప్రత్యేక పోలీసు బృందం కర్ణాటకకు వెళ్లింది. దొంగలు అక్కడికి వస్తారని అనుకున్న పోలీసులకు శుక్రవారం రాత్రి నిరాశే ఎదురైనట్లు సమాచారం. శనివారం సాయంత్రం ఈ కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు తెలిసింది. చోరీకి పాల్పడిన వారిలో ఒకరు దొరికినట్లు సమాచారం. నిందితులను పట్టుకున్నట్లు ప్రచారం జరుగుతున్నా.. ఈ విషయాన్ని పోలీసులు ఇంకా నిర్ధారించలేదు. ఆదివారం లేదా సోమవారం దొంగలను తెలంగాణకు తీసుకువచ్చి, ప్రెస్‌మీట్ నిర్వహించే అవకాశాలున్నాయని తెలిసింది. పోలీసులు విడుదల చేసిన సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దొంగలు మహారాష్ట్ర లేదా పొరుగురాష్ట్రం వారి అయి ఉంటారని 'సాక్షి' ముందే వెల్లడించిన విషయం తెలిసిందే.

క్లుప్తంగా

రమేశ్‌నగర్‌లో చోరీ



బీరువా తాళాలు పగులగొట్టిన దొంగలు

గోదావరిఖని: గోదావరిఖనిలోని రమేశ్‌నగర్‌కు చెందిన జి.అభిలాష్ ఇంట్లో చోరీ జరిగింది. శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి పెళ్లి వేడుకలకు వెళ్లాడు. శనివారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూడగా.. తాళం పగలగొట్టబడి ఉంది. ఇంట్లోని బీరువా తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనలో రూ.29వేలు, తులం బంగారు చైన్ అపహరణకు గురైందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఉరేసుకుని కార్మికుడి మృతి



ఉరేసుకున్న వెంకటేశ్వర్లు

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి పోతనకాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు, 11ఏ మైన్‌లో ఫిట్టర్ శ్రీరాముల వెంకటేశ్వర్లు (40) శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేశ్వర్లు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రెండు నెలలుగా విధులకు హాజరు కాలేదు. ఈ క్రమంలో అప్పు చేశాడు. అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి తేవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో సూసైడ్ నోట్ రాసి ఉరేసుకున్నాడు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వేణుగోపాల్, ఎస్సై కళాధర్ రెడ్డి, శ్యామ్ పటేల్ తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే 'దాసరి' జన్మదిన వేడుకలు



నాయకులు, అభిమానుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



సుల్తానాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, ఎంపీపీ బాలాజీరావు

- గజమాలతో సత్కరించిన కౌన్సిలర్లు
- వ్యవసాయమార్కెట్‌లో కేక్ కట్‌చేసిన నేతలు
- రక్తదానశిబిరాల నిర్వహణ



అన్నదానం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం నియోజకవర్గం వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే నివాసానికి ప్రజాప్రతినిధులు, పార్టీనాయకులు, అధికారులు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు గజమాలతో సత్కరించారు. ట్రినిటి కాలేజీలో యువత రక్తదానం చేసింది. వారికి ఎమ్మెల్యే తనయుడు, ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి పండ్లు అందించారు. వ్యవసాయ మార్కెట్‌లో మాజీ వైస్ చైర్మన్ జడల సురేందర్, జెడ్పీటీసీ రామ్మూర్తి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ కేక్‌కట్ చేశారు. ఏసీపీ మహేశ్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయాల్లో నేతల పూజలు

సుల్తానాబాద్: మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత గౌడ్, ఎంపీపీ బాలాజీరావు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యాలయం ఆవరణలో అన్నదానం చేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. షిరిడి సాయిబాబా ఆలయంలో ఏఎంసీ చైర్మన్ బుర్ర మౌనిక క్షీరాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు కావాలంటే దాసరి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, మండల అధ్యక్షులు పురం ప్రేంచందర్ రావు, యువత అధ్యక్షులు గుడుగుల సతీశ్, వహీద్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కాదాసీ చంద్రమౌళి, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్, కూకట్ల గోపి, తిరుపతి, బాపూరావు, సాజిత్, కలీం, దయాకర్, బండి సంపత్ గౌడ్, సర్పంచులు మోహన్ రెడ్డి విజేందర్ గౌడ్ పాల్గొన్నారు.

నేడు న్యూమారేడుపాకలో మెగా వైద్యశిబిరం

- ఉచితంగా మందులు పంపిణీ



ఎ.మనోహర్

గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని న్యూమారేడుపాకలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో మాట్లాడారు. వకీల్‌పల్లి గని ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని న్యూమారేడుపాక, పెంచికల్‌పేట్, వీర్లపల్లి, అల్లూరు గ్రామాల ప్రజల కోసం ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, ఎముకల వైద్యులు, గైనకాలజీ వైద్యులు, చాతి నిపుణులు, చెవి, ముక్కు, గొంతు వైద్యులు, చర్మ, పంటి వైద్యులు, కంటి వైద్యులు వీటితోపాటు ల్యాబ్‌కు సంబంధించి అన్ని పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు



పాఠశాల ఆవరణలోని రాక్ గార్డెన్ పరిశీలిస్తున్న చైర్మన్

ధర్మారం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విద్యా సంక్షేమ నిర్మాణాత్మక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పత్తిపాక ఉన్నత పాఠశాలను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. గార్డెన్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మన ఊరు మనబడి కింద చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన డ్యూయెల్ డెస్కులు, డిజిటల్ క్లాస్‌లోని ఆన్‌లైన్ ప్యానెల్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల ఆవరణను ఆహ్లాదకరమైన వాతావరణంగా తీర్చిదిద్దిన హెచ్‌ఎం షేక్, ఉపాధ్యాయులను అభినందించారు. మన ఊరు– మనబడిలో నూతన భవనాలు, సదుపాయాలు కల్పిస్తోందన్నారు. డీఈవో మాధవి, సర్పంచ్ బద్దం సుజాత, ఎంఈవో ఛాయాదేవి, డీఈఈ రమణ, ఏఈ నవీన్ పాల్గొన్నారు.

జీడీనగర్ పాఠశాల సందర్శన

పాలకుర్తి: మండలంలోని జీడీ నగర్ ప్రభుత్వ పాఠశాలను శ్రీధర్‌రెడ్డి సందర్శించారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం గెస్ట్‌హౌజ్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఈవో, ఎంఈవో లక్ష్మి, సర్పంచ్ సూర సమ్మయ్య, పీఆర్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్లోబల్ సదస్సుకు జూలపల్లి జెడ్పీటీసీ



బొద్దుల లక్ష్మణ్

జూలపల్లి/ఎలిగేడు: దుబాయ్‌లో నార్త్ అమెరికన్ పద్మశాలి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరల్డ్ గ్లోబల్ పద్మశాలీ సదస్సుకు జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ ప్రత్యేక ప్రతినిధిగా హాజరవుతున్నారు. ప్రపంచ నలుమూలల నుంచి వివిధ రంగాల్లో నిపుణులు, పద్మశాలి ప్రముఖులు పాల్గొననున్నారు. లక్ష్మణ్ మాట్లాడుతూ పద్మశాలీల రాజకీయ, ఆర్థిక అంశాలపై చర్చలు ఉంటాయని, వివిధ అంశాలపై భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పద్మశాలీలను ఏకతాటిపైకి తీసుకురావడమే సదస్సు ఉద్దేశమన్నారు. గతంలో చట్ట సభల్లో ప్రతినిధులుగా ఉండేవారని, ప్రస్తుతం తిరోగమన దిశలోకి వెళ్లిపోవడానికి కారణాలు, ఆ పరిస్థితులను ఎలా అధిగమించాలో సదస్సులో చర్చిస్తామని తెలిపారు.

రూ.25వేల కోట్ల బకాయిలు చెల్లించాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

గోదావరిఖని: సింగరేణి సంస్థకు రావాల్సిన రూ.25వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆర్జీ–1 ఏరియా జీడీకే–2వ గనిలో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. రూ.15వేల కోట్ల విద్యుత్, రూ.10వేల కోట్ల బొగ్గు బకాయిలు సంస్థకు రావాల్సి ఉండగా యాజమాన్యం ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తోందన్నారు. సంస్థ పరిరక్షణ, కార్మిక హక్కుల సంరక్షణ, ఆర్థికంగా సామాజిక భద్రత కల్పించాలన్నారు. నాయకులు ఆకుల హరిణ్, మాదాసు రవీందర్, బోడకుంట రాజేశం, తాట్ల లక్ష్మయ్య, వై.కోటయ్య, రాపోలు వజ్రవేణు, పెంచాల వెంకటస్వామి, సంగాని సాంబయ్య, ఆరేపల్లి వెంకటరాజం, భీమునిపెల్లి నారాయణ, పింగిలి అజయ్‌కుమార్, రాయి సారయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్‌లో స్వర్ణపతకం



రాధను సన్మానిస్తున్న జీఎం వెంకటేశ్వర రావు

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ ఆర్జీ–3 పరిధి ఓసీపీ–1లో ఉద్యోగి కాంటేవాడ బుగ్గాజి భార్య రాధ హర్యానాలో ఈనెల 16 నుంచి 19 వరకు నిర్వహించిన నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించింది. ఆమెను శనివారం ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వర్ రావు సన్మానించారు. రాష్ట్రం తరఫున రాధ పాల్గొని నాలుగు పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. రాధ 400 మీటర్ల రిలే పరుగు పందెంలో స్వర్ణం, 1600 మీటర్లు, 200, 100 మీటర్ల పరుగు పందాలల్లో రజత పతకాలు సాధించిందన్నారు.

హామీలు నెరవేర్చడంలో విఫలం

- ఎలిగేడులో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి
- పోలీసుస్టేషన్ లేక ఇబ్బందులు
- 50 పడకల ఆసుపత్రికి డిమాండ్
- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు



ముప్పిరితోటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

ఎలిగేడు: ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. హాథ్‌సేహాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముప్పిరితోటలో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ, పల్లె పల్లెకూ విజ్ఞన్న నాలుగో రోజు పాదయాత్ర నిర్వహించారు. రైతులకు రుణమాఫీ చేయలేదని, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని, దళితులకు దళితబంధు ఇవ్వకుండా మభ్యపెడుతున్నారని ఆరోపించారు. రైతులకు 24గంటలు కరెంట్ చేయడం లేదన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి చెరువు మట్టి, ఇసుక మీద ఉన్న ధ్యాస అభివృద్ధి చేయడంలో లేదని పేర్కొన్నారు. మండలకేంద్రంలో పోలీస్ స్టేషన్, జూనియర్ కళాశాల, 50 పడకల ఆసుపత్రిని మంజూరు చేయాలని, లేకుంటే దీక్ష చేస్తామని హెచ్చరించారు. పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, పెద్దపల్లి దేవరాజు, కోరుకంటి వెంకటేశ్వర్ రావు, దుగ్యాల సంతోష్‌రావు, నరహరి సుధాకర్‌రెడ్డి, బాసంపల్లి కొండయ్య, అబ్బయ్యగౌడ్, కోట లాలయ్య, పూరెళ్ల మల్లేశం, అమ్ముల శ్రీనివాస్, రాయమల్లు, చిలుక సతీశ్, చింతకుంట మనోహర్‌రావు, శ్రీనివాస్, రాజయ్య, అంజి, బండి స్వామిశంకర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

కళాశాలలను బలోపేతం చేద్దాం

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ డిగ్రీ కాలేజీల బలోపేతానికి ప్రిన్సిపాల్స్, అధ్యాపక బృందాల కృషి అభినందనీయని టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేలా అధ్యాపక బృందం చేస్తున్న కృషిని అభినందించారు. పెద్దపల్లి కాలేజీలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని ప్రిన్సిపాల్ లక్ష్మినర్సయ్య అన్నారు. సమావేశంలో శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, మనోజ్‌కుమార్, రామకృష్ణ, శ్రీనివాస్, కలందర్‌బాషా, శారద, రవీందర్‌రావు, కృష్ణారెడ్డి ఉన్నారు.